
# ద్విపాత్రాభినయం



ద్విపాత్రాభినయం అనే ఈ కథ 'ఇద్దరు మిత్రులు' సినిమాలో నాగేశ్వర్రావ్ రెండు పాత్రలు అభినయించటం గురించి కాదు. ఒకే మనిషి, అదేరకమైన సన్నివేశాలలో, రెండు విభిన్న పరిస్థితులల్లో, రెండు రకాల స్వభావాలు చూపించటం గురించి. అంటే డాక్టర్ జెకిల్ అండ్ మిష్టర్ హైడ్ లాగా అన్న మాట.

చిన్నప్పుడు డాక్టర్ జెకిల్ అండ్ మిష్టర్ హైడ్, మొదటిసారి చదివినప్పుడు అనుకున్నాను, ఈ పాత్రలో సహజత్వం లేదు, ఏ మనిషీ ఇలా ప్రవర్తించడు అని, నా ఆలోచన తప్పు అని, వెంటనే తెలుసుకున్నాను. మన చుట్టూ ఉండే మనుష్యులలోనే, ఆ ద్విపాత్రాభినయం చేసే మనుష్యులు వున్నారు. వివిధ రకాల మనుష్యుల్నీ, వాళ్ళ మనస్థత్వాల్నీ పరిశీలించే వ్యక్తులకి ఈ విషయం విపులంగా అర్ధమవుతుంది.

'సైకాలజీ' గ్రాడ్యుయేట్ కోర్సు చేస్తూ నా సైకాలజీని చదువుతున్న మా అమ్మాయి, నాతో అంటుంటుంది - "ఎందుకు ఎప్పుడూ అలా అశాంతిగా, కాలుగాలిన పిల్లిలా అటూ ఇటూ తిరుగుతుంటావు - అలా కాస్సేపు విశ్రాంతిగా కూర్చుని, నీ స్ట్రెస్ తగ్గించుకోరాదూ!" అని.

అలా, కాలుగాలిన పిల్లిలా తిరుగుతూనే, "నాకు స్ట్రెస్ ఏమీ లేదు. చాల రిలాక్స్‌డ్‌గా ఉన్నాను" అంటుంటాను, మెడ వెనుక నెప్పిగా ఉన్నచోట చేత్తో రుద్దుకుంటూ.

అది ద్విపాత్రాభినయం కాదంటుంది మా అమ్మాయి. అదేమిటో నాకు తెలీదు.

సరదాగా ముచ్చటిద్దామనుకున్నా, కథకో శిల్పం ఉండాలని విమర్శకులు అంటున్నారు కనుక, ఆ శిల్పం కోసం ఒక పాత్ర, అమరశిల్పి జక్కన్న పేరున - జక్కన్న అని సృష్టిద్దాం. జక్కన్న అంటే, జెకిల్ లాగా అన్న మాట. మరి జెకిల్ ఉంటే హైడ్ ఉండాలి కనుక హన్నూ అనే పేరు పెడదాం ఆ రెండో పాత్రకి. నేను హైస్కూల్లో ఉండే రోజుల్లో హనుమంతరావ్ అనే మంచి మిత్రుడొకడుండేవాడు. అతన్ని హన్నూ అని పిలిచేవాళ్ళం. కనుక మనకి జక్కన్న, హన్నూ అన్న పేర్లు, జెకిల్ అండ్ హైడ్ అనే పేర్లకు దాదాపు సరిపోతాయి. వీటిలో మంచి పాత్ర ఏదీ, చెడ్డ పాత్ర ఏదీ అని చూడనక్కరలేదు. మంచి పాత్రల్లో చెడూ వుంది, చెడ్డ పాత్రలో మంచీ వుంది. మంచీచెడుల కలయిక మనిషి కనుక అందుకని ఒకే పేరుకి, ఒక విలక్షణమైన లక్షణం యివ్వద్దు మనం.

ఇక జక్కన్న, హన్నూ ఇద్దరు మనుష్యులు కారు. ఒకే మనిషికి వున్న రెండు విభిన్న ప్రవృత్తులు. ఒకే రకమైన సన్నివేశంలో, రెండు రకాల పరిస్థితుల్లో, ఒకే మనిషి, ఆ రెండు ప్రవృత్తులనీ ఎలా చూపిస్తాడో చూద్దాం. అలా చూపించటానికి, రెండు భిన్న వాతావరణాల్లో, రెండు చోట్ల రెండు సార్లు కథ నడిపిద్దాం.

ఎయిర్ ఫ్రాన్స్‌వారి విమానం, న్యూయార్క్ నించీ పారిస్ వెడుతున్నది. కౌంటర్ దగ్గర లైన్లో జక్కన్న చేత్తో బ్రీఫ్‌కేస్ పట్టుకుని, ప్రక్కనే ఒక పెద్ద సూట్‌కేస్‌తో నుంచున్నాడు. అతని ముందు, లైన్లో ఇరవై మంది వుంటారేమో. అతని వెనుక యింకో పాతిక మంది వున్నారు. ఒకళ్ళ కొకళ్ళు తగలకుండా నుంచుని వున్నారు.

జక్కన్న ముందువున్న ఎర్రజుట్టు అమ్మాయి, నుంచునే ఏదో పుస్తకం చదువుకుంటున్నది. ఆ అమ్మాయి వేసుకున్న గౌను మరీ చిన్నదిగా వుంది. నున్నటి భుజాలు, అందమైన పొడుగాటి కాళ్ళు, చక్కటి అవయవాల పొందికతో ఆమె మెరుపు తీగలా కనిపిస్తున్నది. ఆ కౌంటర్ దగ్గర లైను కొంచెం నెమ్మదిగా కదిలితే బాగుంటుంది అని జక్కన్న మనసులో మరోసారి అనుకుని, కొంచెం దూరంగా నిశ్శబ్దంగా నుంచుని, కళ్ళు అటూ ఇటూ తిప్పుతూ, కూచిపూడి అభినయం చేస్తూ నుంచున్నాడు.

అతను అభిలషించినట్టుగానే లైను నెమ్మదిగా కదులుతున్నది. తన వంతురాగానే టిక్కెట్టు ఇచ్చాడు.

"విండో సీట్ ప్లీజ్" అన్నాడు.

కౌంటర్ దగ్గర అమ్మాయి, తను ఆప్యాయంగా పెంచి ఎర్రరంగు వేసిన గోళ్ళు విరిగిపోకుండా జాగ్రత్త పడుతూ, తన తెల్లటి వేళ్ళతో కంప్యూటర్ కీ బోర్డు మీద టకటక లాడించి, జక్కన్న వేపు చూసింది. ఒకసారి హుందాగా తల ఎగరేసి, తన రాగి జుట్టుని వెనక్కితోసి, మెరుస్తున్న ఎర్రటి పెదాలను సున్నాలా పెట్టింది. అందమైన అమ్మాయిలు పెదవులు సున్నాలా పెడితే,

చాల ఇష్టం జక్కన్నకి.

"సారీ - మిష్టర్ జక్కన్నా! విండో సీట్లు లేవు. మధ్యలో ఇస్తున్నాను (ఇద్దరు బాగా లావాటి వాళ్ళ మధ్య) - ఫరవాలేదా?" అన్నది, తెల్లటి అందమైన పలువరసలోని రత్నాలను జిగేల్ మని మెరిపిస్తూ.

ఆ మెరుపుకి కళ్ళు చెదిరిన జక్కన్న, ఒక్క సారి కళ్ళు నులుముకుని, "మీ ఇష్టం" అన్నాడు నవ్వుతూ.

సుతారంగా బోర్డింగ్ పాస్ అందించి, ఈ సారి కళ్ళతో నవ్వి, పెదవులతో - "హావ్ ఎ నైస్ ట్రిప్" అన్నది.

జక్కన్న థాంక్స్ చెప్పి, విమానం ఎక్కకముందే మేఘాల్లో తేలిపోతూ, ఎయిర్ పోర్ట్‌లో నడుచుకుంటూ వెళ్ళాడు ముందుకి.

ఇమ్మిగ్రేషన్, సెక్యూరిటీ చెక్‌లు అయ్యాక విమానంలో ఎక్కటానికి, సీట్ల వరుస నెంబర్ల ప్రకారం పిలుస్తున్నారు. అందరూ తమ వరుస సీట్ల నెంబర్లు పిలిచినప్పుడే వెళ్ళి విమానం ఎక్కుతున్నారు. జక్కన్న పక్కనే నుంచుని, విమానం ఎక్కుతున్న తెల్లవాళ్ళనీ, నల్లవాళ్ళనీ, ఎర్రవాళ్ళనీ, మగవాళ్ళనీ, ఆడవాళ్ళనీ, పిల్లవాళ్ళనీ, అందర్నీ చూస్తూ, తాపీగా నుంచున్నాడు.

జక్కన్న తన సీటు నెంబరు పిలిచాక, నెమ్మదిగా వెళ్ళి, తన సీట్లో కూర్చున్నాడు. అన్నీ ఇలా వివరంగా రాసుకుంటూ వెడితే, ఈ కథ నవలంత అవుతుంది కనుక, త్వరగా పోదాం. తర్వాత సన్నివేశం - భోజనాల సమయం.

ఫ్రెంచ్ ఎయిర్ హోస్టెస్ వచ్చి, ప్లేటు అందిస్తూ, "ఇదిగో మీ కోసం ప్రత్యేకంగా తయారుచేసిన శాఖాహార భోజనం" అన్నది. అనే ముందూ, తర్వాతా చిరునవ్వు నవ్వింది. ఆ నవ్వు ఒక్క క్షణం, జక్కన్న కళ్ళ ముందు పాదరసంలా మెరిసి, మాయమయింది. ఎందుకంటే ఆ అమ్మాయి అదే నవ్వుని పక్కసీటులోని అసామీకి అందిస్తున్నది ఇప్పుడు.

మూడు టమాటా ముక్కలూ, ఆరు లెట్యస్ ముక్కలూ ఉన్నాయి సలాడ్‌లో. బార్లీగింజలూ, మొక్కజొన్న గింజలూ, ఉడకబెట్టి ఇచ్చారు. అసలు భోజనంలో రెండు పైనాపిల్ ముక్కలూ, రెండు పుచ్చకాయ ముక్కలూ వున్నాయి యింకొక పక్క. ఒక చిన్న బ్రెడ్ రోల్, పక్కనే మార్జరీన్ స్ప్రెడ్. జక్కన్న తినటం పూర్తిచేయగానే, ఫ్రెంచి సుందరి వీరవాసరం వీరుడి దగ్గరకు వచ్చి అన్నది - "మీ కోసం ఎంతో ప్రత్యేకంగా తయారుచేసిన భోజనాన్ని, మీరు ఆనందించారని అనుకుంటున్నాను". ఇంగ్లీషులో ఫ్రెంచి కలిపిందో, ఫ్రెంచిలో ఇంగ్లీష్ కలిపిందో కానీ, జక్కన్నకు మాత్రం రమ్‌లో కోక్ కలిపినట్టుగా వుంది.

"అవును. చాలా బాగుంది. థాంక్స్ ఫర్ ది గ్రేట్ స్టఫ్" అన్నాడు జక్కన్న, జీవితంలో ఎన్నడూ అలాంటి 'భో-జ-నం' గుర్రాలు తప్ప మనుష్యులు తినరుగాక తినరు అని భార్యతో

చాలాసార్లు వాదించిన సంగతి మరిచిపోయి.

ఇప్పుడు ఇదే సన్నివేశాన్ని, హన్నూ ఎలా నడిపించాడో చూద్దాం.

ఎయిర్ ఇండియా వారి విమానం న్యూయార్క్ నించి లండన్‌కి వెడుతున్నది. కౌంటర్ దగ్గర లైన్లో హన్నూ, చేత్తో బ్రీఫ్‌కేస్ పట్టుకుని, ప్రక్కనే ఒక పెద్ద సూట్‌కేస్‌తో నుంచున్నాడు. అతని ముందు, లైన్లో ఇరవై మంది వుంటారేమో. అతని వెనుక యింకో పాతిక మంది వున్నారు. హన్నూ ముందర నుంచున్న ఎఱ్ఱచీర యువతి - నుంచునే ఏదో పుస్తకం చదువుకుంటున్నది.

ఆమెను చూసి హన్నూ అనుకున్నాడు. 'ఈ హడావిడిగా వున్న క్యూలో పుస్తకాలు చదవటం కూడాను. అదో ఫోజు' అని. లైనులో జనం తోపిడి ఎక్కువయిందో, హన్నూ భావాలు టెలీపతిలో వినిపించాయో కానీ, ఆమె పుస్తకాన్ని చదవటం ఆపేసి, ముఖంలో విసుగు రసాన్ని చూపిస్తున్నది. హన్ను కూడా విసుక్కుంటూ, లైను తొందరగా కదిలితే బాగుండును అనుకున్నాడు, అసహనంగా అటూ ఇటూ చూస్తూ. అయినా అతను అనుకున్నట్టుగా ఆ లైను మాత్రం తొందరగా కదలటం లేదు.

తన వంతు రాగానే టిక్కెట్టు యిచ్చాడు - "విండో సీట్ ప్లీజ్" అన్నాడు.

కౌంటర్ దగ్గరున్న ఆ అందమైన అమ్మాయి, హన్నూ టిక్కెట్టు తీసుకుని లోపలికి వెళ్ళి, అక్కడ నవ్వుతూ, ఎవరితోనో ఏదో మాట్లాడుతున్నది.

హన్నూ సహనం చచ్చిపోయి, దిక్కులూ చూస్తూ నుంచున్నాడు.

నాలుగు నిమిషాల తర్వాత ఆ అమ్మాయి వచ్చి, కంప్యూటర్ కీ బోర్డు మీద తన చక్కటి తెల్లటి వేళ్ళతో టకటక లాడించి, హన్నూ వేపు చూసింది. ఒక్కసారి హుందాగా తల ఎగరేసి, తన నల్లజుట్టును వెనక్కి తోసి, పెదవుల మీద ఎఱ్ఱటి లిప్‌స్టిక్‌తో చిరునవ్వుని కలిపి, సూటిగా అతని కళ్ళల్లోకి చూసింది.

"సారీ మిష్టర్ హన్నూ! విండో సీట్లు లేవు. మధ్యలో ఇస్తున్నాను" అన్నది, అందమైన తన పలు వరసలోని రత్నాలను జిగేల్‌మని మెరిపిస్తూ.

ఆ నవ్వుకి, హన్నూకి కోపం వచ్చింది. "నేను మూడు నెలల క్రితం టిక్కెట్టు రిజర్వ్ చేసుకునేటప్పుడు అడిగాను, విండో సీటు కావాలని" అన్నాడు కోపంగా.

"అయుండవచ్చు. కానీ కంప్యూటర్ అలా చూపించటం లేదు. ఇది ఫుల్ ఫ్లయిట్ అవటం వలన ఇంతకన్నా నేను ఏమీ చేయలేను" అన్నది.

"సరే కానీయండి" అన్నాడు హన్నూ, తను కూడా ఏమీ చేయలేక.

హన్నూ సూట్‌కేసుని పైకెత్తి, కన్వేయర్ బెల్ట్ మీద ధణేల్‌మని పడేసిందామె.

హన్నూ మళ్ళీ కోపంగా, "దాంట్లో పగిలిపోయే బహుమతులు ఉన్నాయి. విరిగి పోతాయేమొ. కాస్త మెల్లగా పడేయకూడదూ" అన్నాడు.

ఆమె అన్నది "మీ లగేజ్ ముంబైదాకా చెక్ చేశాను.హేవ్ ఎ నైస్ ట్రిప్" అని.

హన్నూ ఆమెకి థాంక్స్ కూడా చెప్పకుండా, చేతిలోని బ్రీఫ్‌కేస్‌ని చేతులు మార్చుకుంటూ, ఎయిర్‌పోర్టులో నెమ్మదిగా నడుచుకుంటూ వెళ్ళాడు ముందుకు.

ఇమ్మిగ్రేషన్, సెక్యూరిటీ చెక్స్ అయ్యాక, విమానంలో ఎక్కటానికి సీట్ల నెంబర్ల వరస ప్రకారం పిలుస్తున్నారు. ఎవరూ ఆ పిలుపులు పట్టించుకోకుండా, త్రోసుకుని ముందుకు వెడుతున్నారు. హన్నూ అందరిని తేరిపారి చూశాడు. హిందీవాళ్ళూ, తెలుగు వాళ్ళూ, పెద్దవాళ్ళూ, చిన్నవాళ్ళూ - అందరూ ఒక్కళ్ళనొకళ్ళు తోసుకుంటూ, ముందుకు వెడుతున్నారు.

చిన్నప్పుడు, విజయవాడ అలంకార్ టాకీసు దగ్గర కొత్త సినిమా వచ్చినప్పుడు, తను టికెట్టు కౌంటర్ దగ్గర చేసిన యుద్ధం గుర్తు కొచ్చింది. హనుమంతుడిలా విజృంభించాడు. అందర్నీ అటూ ఇటూ తోసేసి, ముందుకు వెళ్ళి తన సీట్లో కూర్చున్నాడు.

కథని మళ్ళీ కొంచెం ఫాస్ట్ ఫార్వర్డ్ చేద్దాం ఇందాకటి లాగానే. అది భోజనాల సమయం.

ఎయిర్ హోస్టెస్‌ని చూసి, ఎయిర్ ఇండియా హోస్టెస్‌లు పట్టుచీరలు కట్టుకుని, పేరంటానికి వెడుతున్నట్టు తయారవుతారెందుకో అనుకుంటున్న హన్న దగ్గరకు వచ్చింది ఎయిర్ హోస్టెస్.

"ఇదిగోనండీ మీకోసం శాఖాహార భోజనం". అన్నది. అనే ముందు మర్యాదగా, అన్న తర్వాత స్నేహపూర్వకంగా చిరునవ్వు నవ్వింది.

ఆ ప్లేట్లో ఒక చపాతీ, బంగాళా దుంపల కూర, వెజిటబుల్ పలావు, పెరుగూ, ఒక గులాబ్‌జామ్ వున్నాయి. భూమికి ముప్పై అయిదు వేల అడుగుల పైన ఎగురుతున్న విమానంలో, వేడి వేడి భారతీయ భోజనం ఆబగా తిన్నాడు హన్నూ.

తినటం అవగానే, ఆ ఆకాశ సుందరి, వీరవాసరం వీరుడి దగ్గరకు వచ్చి - "మీ కోసం చేసిన శాకాహార భోజనం, మీరు ఆనందించారని అనుకుంటున్నాను" అన్నది ఇంగ్లీష్‌లో.

ఇంగ్లీష్‌లో మరాఠీ కలిపిందో, మరాఠీలో ఇంగ్లీష్ కలిపిందో కానీ, బంగాళాదుంపల కూరలో ఇంకా కొంచెం ఏదో కలిపితే బాగుంటుంది అనిపించింది హన్నూకి.

"ఆఁ! ఏంబాగు. కూరలో ఇంకా కొన్ని పచ్చి మిరపకాయలు తగిలిస్తే బాగుండేది. కారంగా లేదు!" అన్నాడు ఆంధ్రా గొడ్డు కారాన్ని తలుచుకుంటూ.

పిల్లలు పుట్టిన తర్వాత, తన భార్య "పిల్లలు ఎక్కువ కారం తినలేరు" అని, ఇంట్లో అన్ని పదార్థాలలోనూ కారం పూర్తిగా తగ్గించేసి పదిహేనేళ్ళు దాటిందని అప్పుడు మరిచిపోయాడు హన్నూ.

★★★

ఈ కథలో జక్కన్న, హన్నూ, ఒకరే అని చెప్పాను. ఒకే మనిషికి ఇలా రెండు మనస్థత్వాలు

వుండటం, ఈ కథలో హీరోకి మాత్రమే పరిమితం కాదు. ఇలాంటి వాళ్ళను ప్రతిచోటా చూస్తూనే వుంటాం మనం. మనల్ని నిశితంగా పరిశీలించుకుంటే, మనలో కొంత మందిలో ఆ లక్షణాలు కనపడ్డా ఆశ్చర్యపోనక్కరలేదు.

ఎందుకు మనుషులు అలా ప్రవర్తిస్తారు? దానికి కారణాలు ఏమిటి? అన్నది వివరంగా వ్రాయటానికి నేను మనస్తత్వ నిపుణుణ్ని కాను. ఒక వేళ అలాంటి శాస్త్రవేత్తల సహాయంతో విపులీ కరిస్తే, ఈ కథను ఏ సైకాలజీ పత్రికకో పంపిచాల్సి వస్తుంది. అందుకని నా బాణీలో ఈ కథ వ్రాశాను. కథ చదివిన తర్వాత ఈ విషయం గురించి ఆలోచించవలసింది మీరు. ●

*(రచన ఇంటింటి పత్రిక, జూలై, 1999)*